సాక్షి మెదక్

మంగళవారం। 25। ఏప్రిల్। 2023



భయం.. భయంగా ప్రయాణం

అకోలా- నాందేడ్ రహదారి నుంచి సంగారెడ్డికి రావాలంటే వాహనదారులు జంకుతున్నారు. కేవలం ఆరు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ అయోమయానికి గురవుతున్నారు. 8లో



తేనెటీగల దాడి

కొండపాక మండలంలోని జప్తినాచారం గ్రామ శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. భయంతో కూలీలు పరుగు తీశారు. 8లో



సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటకు చెందిన పలువురికి చెక్కులను అందజేశారు. 9లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న వీఓఏలు

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్ ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 8వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా చెవిలో పూలతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఎలాంటి గుర్తింపు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూపరాణి, కోశాధికారి కవితతో పాటు ఆయా మండలాలకు చెందిన వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

నిజాంపేట(మెదక్): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీలతో పాటు అన్ని వర్గాలకు సమున్నత స్థానం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం మండల పరిధిలోని చల్మెడలో బీరప్ప కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కల్వకుంట గ్రామంలో గంగా భవాని ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజా మహేందర్, మండల శాఖ అధ్యక్షుడు లింగంగౌడ్, నాయకులు స్వామి, మసూద్, మధుసూధన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మధు, యాదవరెడ్డి, నారాయణ, రాంరెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మల్లేశం

నర్సాపూర్: మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనేక పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రం కాలరాస్తుందని ఆరోపించారు. మే 1వ తేదీన కార్మిక ఉత్సవాలు చేపట్టాలని కార్మికులను కోరారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు నాగరాజు, మహేశ్, చంద్రయ్య, శంకరయ్య, శ్రీశైలం, అనిత, దాసు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ రూరల్: 2023- 25 విద్యా సంవత్సరానికి గానూ డీసెట్- 23 నోటిఫికేషన్ వెలువడినట్లు జిల్లా డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉపాధ్యాయ శిక్షణ, పూర్వ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 25 నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జనరల్ కేటగిరి వారికి ఇంటర్మీడియట్లో కనీసం 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హత పరీక్షను జూన్ 1వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 17 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఉండాలని సూచించారు.

నేడు లీగల్ లిటరసీ క్యాంపు

మెదక్ కలెక్టరేట్: నేడు కొల్చారం మండలం పోతంశెట్టిపల్లిలోని రైతు వేదికలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మెదక్ సబ్ జైలును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైలులో ఉన్న ఖైదీదారుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వంటశాల తనిఖీ చేసి ఆహారం గురించి జైలు పర్యవేక్షణ అధికారితో చర్చించారు.

చతికిలబడి

- ముందుకుసాగని 'మన ఊరు- మనబడి'
- ఎంఓఎంజీ కింద 313 స్కూళ్ల ఎంపిక
- 35 పాఠశాలల్లో ప్రారంభం కాని పనులు



అసంపూర్తిగా మల్లంపేట ఉన్నత పాఠశాల

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చి విద్యార్థులకు మౌలిక వసతులతో కూడిన విద్యనందించాలన్న లక్ష్యంతో రూపొందించిన 'మన ఊరు- మన బడి' పనులు ముందుకు సాగడం లేదు. సకాలంలో బిల్లులు రావేమోనని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో 35 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాలేదు. అయిన చోట కూడా పూర్తిస్థాయిలో చేయలేదు. మొత్తం రూ. 130.95 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.15.33 లక్షలు పాఠశాలల అకౌంట్లలో జమ చేశారు.

- జిల్లాలో మొదటి విడతగా ప్రభుత్వం 313 పాఠశాలలను ఎంపిక చేసి రూ. 130.95 కోట్లు మంజూరు చేసింది.
- ఇందులో మనఊరు- మనబడి కింద రూ. 66.16 కోట్లు, ఎంజీఎన్ఆర్‌జీఎస్ కింద రూ. 64.79 కోట్లు మంజూరు చేశారు.
- ఎంఓఎంబీ కింద విద్యుత్, తాగునీరు, మరమ్మతులు, ఎన్ఆర్‌జీఎస్ కింద ప్రహరీ, టాయిలెట్స్, కిచెన్‌షెడ్లు నిర్మించాలని నిర్ణయించారు.
- అయితే పాఠశాలల ఎంపికలో సమస్యలను సరిగా గుర్తించకుండానే ఎంపిక చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.
- వేసవి సెలవుల్లో వచ్చిన ఇంజినీర్లు, స్థానిక సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు మొక్కుబడిగా ఇచ్చిన సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్న విమర్శలు ఉన్నాయి.
- పాపన్నపేట మండలం మల్లంపేట ఉన్నత పాఠశాలలో సరిపోను గదులు లేవు. ఉన్న గదుల పైకప్పులు కూడా శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.
- పాఠశాలకు రూ. 11 లక్షలు మాత్రమే మంజూరు చేయగా.. నిధులు సరిపోక పనులు ఆగిపోయాయి.
- పనులు పూర్తికాకపోతే వచ్చే విద్యాసంవత్సరం తరగతులు ఎలా నిర్వహించాలని తలలు పట్టుకుంటున్నారు.
- పాఠశాలకు రూ. 30 లక్షలకు మించి నిధులు మంజూరైతే వాటికి టెండర్లు పిలవాలి. ఈ క్రమంలో మొత్తం 57 పాఠశాలలుండగా అందులో 35 పాఠశాలలకు టెండర్లు వేయడానికి ఎవరూ ముందుకు రాలేదు.
- బిల్లులు సకాలంలో రావడం లేదన్న ఆరోపణలతో కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.
- ఈ సమస్యను గుర్తించిన స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు, టెండర్ కాని చోట ఎస్ఎంసీలు, స్థానికులు పని చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.
- అయితే పనులు ప్రారంభమైన 278 పాఠశాలల్లో కూడా పూర్తిస్థాయిలో పనులు కాలేదని తెలుస్తోంది.

పరుగులు పెట్టిస్తున్న కలెక్టర్

- మన ఊరు- మన బడి పనుల్లో వేగం పెంచేందుకు కలెక్టర్ రాజర్షిషా 15 రోజులకోసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.
- ఇప్పటివరకు రూ. 16.20 కోట్ల పనులు కాగా అందులో రూ. 15.33 కోట్లు మంజూరు చేసి పాఠశాలల అకౌంట్లలో జమ చేశారు.
- మిగితా రూ. 87 లక్షలు మంజూరు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

మే 31 నాటికి పూర్తి చేస్తాం

మే 31 నాటికి మన ఊరు- మన బడి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చాలా పాఠశాలలో పనులు ప్రారంభం అయ్యాయి. పూర్తిస్థాయిలో పనులు జరిగేలా చూస్తున్నాం. రూ. 30 లక్షలకు పైగా నిధులు మంజూరైన చోట కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఎస్ఎంసీలు, స్థానికులు పనులు చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేశాం.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఒక్క రూపాయి లేకుండా చెల్లిస్తాం

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

అల్లాదుర్గం(మెదక్): మన ఊరు- మనబడి పనులు చేసి నష్టాలపాలయ్యామని అల్లాదుర్గంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాంట్రాక్టర్లు, హెచ్‌ఎం, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'బిల్లులు ఇస్తేనే కొత్త పనులు' శీర్షికన ఈనెల 22న 'సాక్షి' కథనం ప్రచురించింది. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు డీఈఓ రాధా కిషన్ సోమవారం అల్లాదుర్గంలో మన బడి పనులపై సమీక్ష నిర్వహించి పూర్తి వివరాలు సేకరించారు. పీఆర్ ఏఈ సక్రమంగా రికార్డులు చేయకపోవడంతోనే నష్టాలపాలయ్యామని వారు డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముస్లాపూర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అల్లాదుర్గం కేజీబీవీని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. మన ఊరు- మనబడి పనులు చేస్తే ఒక్క రూపాయి నష్టపోకుండా బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. పీఆర్ ఏఈ సక్రమంగా రికార్డులు చేయలేదని, ప్రైవేట్ వ్యక్తిని పెట్టుకుని రికార్డులు చేయడంతో బిల్లులు తక్కువ వచ్చినట్టు చెప్పారు. వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్యానాయక్, పీఆర్ డీఈఈ శ్రీనివాస్, ఎంపీడీఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



నర్సాపూర్: కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మనోహరాబాద్: కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

నర్సాపూర్: 'కంటి వెలుగు'ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని చూసి పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని చెప్పారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బబియానాయక్, కౌన్సిలర్ కుమ్మరి లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పార్టీ ప్లీనరీలో భాగంగా నేడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగరవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం నర్సాపూర్‌లో జరిగే పార్టీ ప్రతినిధుల సమావేశానికి రావాలని సూచించారు.

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని రంగాయపల్లి పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నాగభూషణంతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్నవారికి త్వరలోనే చికిత్స సైతం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత రవి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న గరుడ గంగ పుష్కరాలు



మంజునాథ స్వామికి అభిషేకం చేసేందుకు గంగా జలం తీసుకెళ్తున్న భక్తులు

మెదక్ రూరల్: మెదక్ మండలం పేరూరు శివారులోని సరస్వతీ ఆలయం వద్ద గరుడ గంగ పుష్కరాలు సోమవారం మూడో రోజు కొనసాగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సరస్వతీ మాతను దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు చేసిన భక్తులు పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మకు పసుపు, కుంకుమతో వాయినాలు సమర్పించారు. తమ పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని పిండ ప్రధానం, శ్రాద్ధ కర్మ నిర్వహించారు. అనంతరం మంజునాథ స్వామికి మంజీరా గంగ జలంతో సహస్ర కళశాభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు రాజమౌళి శర్మతో పాటు ప్రధాన పూజారులు గుణాకర్‌శర్మ, మహేష్‌శర్మ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

'రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి'

మెదక్ రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు. సోమవారం హవేలి ఘనపూర్ మండలం కూచన్‌పల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ సమయంలో కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులు, నిర్వాహకులపై ఉందన్నారు. తరుగు విషయంలో నష్టం కలుగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవగౌడ్, నాయకులు సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కిష్టగౌడ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెదక్‌లో ప్రతినిధుల సభ

మెదక్ మున్సిపాలిటీ: తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతినిధుల సభలో వివరిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని గోల్ బంగ్లా వద్ద ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసభలో 12 తీర్మానాలు ప్రవేశపెడతామని చెప్పారు. సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్రాలను ప్రతి రోజు సందర్శించి నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ధాన్యం తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మెదక్‌లో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్‌లో ఆయాశాఖల విభాగాల కోసం పార్టీషన్స్ ఏర్పాటుకు తమ తమ శాఖల్లో ఉన్న వడ్డీ వెంటనే అందజేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు కంటి వెలుగు శిబిరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా రహదారుల నిర్మాణం, డబుల్ బెడ్రూం ఇళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్, మురుగు కాలువలు, డంపింగ్ యార్డ్, తదితర నిర్మాణాల ప్రగతిపై అంశాల వారీగా చర్చించారు.

కుంభమేళా.. కదలివచ్చే



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): రెండో బాసరగా విరాజిల్లుతున్న రాఘవాపూర్-హుమ్నాపూర్ శివారు పంచవటి క్షేత్రంలో సోమవారం కుంభమేళా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పంచవటి క్షేత్రంలో శారదాదేవి, సాయిబాబ, వెంకటేశ్వరస్వామి, శనీశ్వరస్వాములను దర్శించుకున్నారు. మంజీర నది వద్ద గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి, తదితరులు నది వద్ద ధ్వజారోహణం నిర్వహించారు. అయితే ఏర్పాట్లపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. నదిలో చాలా భాగం బురదమయంగా ఉండడంతో ఇబ్బంది పడ్డారు.



మంజీర నదికి తరలివస్తున్న సాధువులు

ప్రజావాణికి వినతుల వెల్లువ


అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణికి సోమవారం వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి 70 అర్జీలు రాగా కలెక్టర్ రాజర్షిషా స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి తగాదాలు, వివాదాలకు సంబంధించి పోలీస్, న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఫిర్యాదుదారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉన్న పొలం పోయింది



నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినప్పుడు నా పొలం గవ్వలపల్లి తండాకు చెందిన బానోత్ హస్లి పేరుపై 17 గుంటలు పడింది. ఆ తర్వాత మరో 3 ఎకరాలు సైతం ఆమె పేరున మారింది. నాపేరుపై మార్చాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

–బానోత్ హరి, ఎస్.కొండాపూర్ తండా

నాలుగు వారాలుగా తిరుగుతున్నా



మెదక్ పట్టణంలోని మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆస్తిని నకిలీ పత్రాలు సృష్టించి మా సమీప బంధువులు ఆక్రమించుకున్నారు. ఈవిషయమై నెల రోజులుగా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు సంబంధం లేదని చెబుతున్నారు.

– ప్రవీణ్, మెదక్

కొత్త పాస్‌బుక్ ఇవ్వడం లేదు



మా పట్టా భూమికి సంబంధించి కొత్త పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వడం లేదు. మా నాన్న పేరున పొలం ఉన్నట్లుగా తహసీల్దార్ రికార్డు ఇచ్చారు. కానీ కొత్త పాస్‌బుక్ మాత్రం ఇవ్వడం లేదు.

– సిద్దిరాంలు, బి.తిమ్మాయిపల్లి

అక్రమంగా భూమి కబ్జా చేశారు



బతుకు దెరువు కోసం పట్నం వలస వెళ్లాను. మా ఊరిలో దళితుల అభివృద్ధికి భూములు ఇస్తున్నట్టు తెలిసింది. అయితే వారికిచ్చే భూముల పక్కనే మా ఇంటి స్థలం, ఇల్లు ఉంది. నా ఇంటిని కూలిగొట్టి ప్రభుత్వ భూమితో పాటు నా భూమిని సైతం ఆక్రమించుకున్నారు.

–ఆత్మకూరి శ్రీకృష్ణ, పేరూర్

క్లుప్తంగా

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో తమ సిబ్బందితో నాలుగు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 13 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ అనంతరం న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికీ రూ.29,500 జరిమానా విధించారు.

గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): తాటిచెట్టుపై నుంచి జారి పడి గీతకార్మికుడు గాయపడిన ఘటన మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బూడిద అంజయ్య రోజువారిగా తాటి చెట్టు ఎక్కే క్రమంలో జారి గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరం మెరుగైన వైద్యంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించారని వైద్యులు చెప్పారు.

చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం .. కొలంపేటకు చెందిన పాలిమేర కృష్ణ రాములు(60) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని వాలెంటీస్ లాబరైటీస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన పనిచేసే చోట గ్యాస్ ప్లాంట్ డ్యామేజ్ కాగా వేడినీరు కృష్ణ రాములు శరీరంలోని మెడ, పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో బొబ్బలు వచ్చాయి. దీంతో పరిశ్రమ నిర్వాహకులు ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కంచన్‌బాగ్ అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మధ్యరాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వట్‌పల్లి(అందోల్): అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న 112 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఘటన సోమవారం వట్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అంబర్యా తెలిపిన వివరాల ప్రకారం..వట్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా జహీరాబాద్ నుంచి డీసీఎం డ్రైవర్ అఫ్సర్ మియా పెద్దశంకరంపేటకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న క్రమంలో పోలీసుల తనిఖీలో వాహన డ్రైవర్ పారిపోయేందుకు యత్నించగా అతన్ని పట్టుకొని డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశారు. 112 క్వింటాళ్ల రేషన్‌బియ్యం బస్తాలను వారు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ ఘటనపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సాయిరవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భయం.. భయంగా ప్రయాణం!

- ఆరు కిలోమీటర్లకు అర్ధగంట కంటే ఎక్కువే
- ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న వాహనాలు
- తరచు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



డివైడర్ ఏర్పాటు చేయాల్సిన సంగారెడ్డి టు ఫసల్వాది రోడ్డు ఇదే

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రయాణం చేయాలంటేనే అరచేతిలో ప్రాణం పెట్టుకునే పరిస్థితులు దాపురించాయి. ప్రతీనిత్యం ఇండ్ల నుంచి తమ తమ పనులపై బయటకు వెళ్లి తిరిగి వచ్చేంతవరకూ కుటుంబీకులు వారి రాక కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వస్తుంది. ఉదయం వెళ్లినప్పటి నుంచి రాత్రి తిరిగి వచ్చేంతవరకు కుటుంబీకులు ఇంటికి క్షేమంగా చేరుకోవాలని కోరుకుంటారు. అలాంటి తరుణంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటోందో అర్థం చేసుకోవచ్చు. పనుల నిమిత్తం తమ తమ వాహనాలపై ప్రయాణించే వారు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలంటే రహదారులు సైతం సక్రమంగా ఉండాలి. కానీ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న అకోలా–నాందేడ్ రహదారి నుంచి సంగారెడ్డికి రావాలంటే కేవలం 6 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ సమయం మాత్రం దాదాపు అరగంట పడుతుంది. ఇందుకు కారణం నాందేడ్ జాతీయ రహదారి నుంచి గణపతి షుగర్ ఫ్యాక్టరీ గుండా పసల్వాది గ్రామం మీదుగా ఎంఎన్‌ఆర్ చౌరస్తా నుంచి సంగారెడ్డికి చేరుకోవాలి. ఇక్కడ రహదారి చిన్నగా ఉండడమే కాకుండా ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు ఇబ్బడి ముబ్బడిగా వస్తూ ఎదుటి వారిని అయోమయానికి గురి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు తమ వాహనాలతో ఎదురెదురుగా ఢీకొంటూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలకు కారణం ఈ రహదారిలో డివైడర్ ఏర్పాటు చేయకపోవడమేనని స్థానికులు, వాహనదారులు చెబుతున్నారు. ఇక్కడ డివైడర్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో మంది ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారు. అంతేకాక వాహనదారులకు సమయం కూడా ఆదా అవుతుంది.

ఆ రోడ్డు గుండా వెళ్లడానికి జంకుతున్నారు

సంగారెడ్డి పాత బస్టాండ్ నుంచి పసల్వాది శివారులో ఉన్న అకోలా నాందేడ్ జాతీయ రహదారి వరకూ డివైడర్ ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు ప్రయాణికులు ఆ రోడ్డుపై వెళ్లడానికి జంకుతున్నారు. జోగిపేట నుంచి వచ్చే వాహనదారులు పసల్వాది నుంచి రాకుండా దూరమైనా సరే సురక్షితంగా వెళ్లాలనే ఉద్దేశంతో పసల్వాది శివారులోని బైపాస్ నుంచి ఇస్మాయిల్ ఖాన్‌పేట్, మామిడిపల్లి చౌరస్తా గుండా కందిమీదుగా సంగారెడ్డికి చేరుకుంటున్నారు.

బైపాస్ రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేయాలి



సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో సైతం డివైడర్ లేక ప్రతినిత్యం వాహనదారులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. పెప్సీ వద్ద అండర్ పాస్ నుంచి మల్కాపురం చౌరస్తా, సంగారెడ్డి చౌరస్తా నుంచి వచ్చే వాహనదారులు బైపాస్‌లో రావాలంటే జంకుతున్నారు. బైపాస్ రోడ్డులో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు నుంచి వచ్చే వాహనదారులు సైతం దూరమైనా సరే, మల్కాపూర్ చింతల్ నుంచి సంగారెడ్డి ప్రధాన చౌరస్తా గుండా సంగారెడ్డి పట్టణానికి వస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మధు, బైపాస్ రోడ్, సంగారెడ్డి

వాహనాలు ఎదురుగా వస్తున్నాయి



మాది పుల్కల్ మండలం, కోడూరు గ్రామం. ప్రతీనిత్యం ఎలక్ట్రిషన్ పనిమీద కోడూరు నుంచి సంగారెడ్డికి వెళ్తుంటాను. కోడూరు నుంచి పసల్వాది బ్రిడ్జి వరకు దాదాపు 20 కిలోమీటర్లు ఉంటుంది. 20 కిలోమీటర్లు అరగంటలో వస్తే, పసల్వాది బ్రిడ్జి నుంచి సంగారెడ్డికి వెళ్లడానికి మరో అరగంట పడుతుంది. డివైడర్ లేకపోవడంతో వాహనదారులు ఎదురెదురుగా వస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఇక్కడి నుంచి సంగారెడ్డి వరకు డివైడర్ ఏర్పాటు చేస్తే సురక్షితంగా సులభంగా ప్రయాణం చేయొచ్చు.

లక్ష్మణ్, కోడూరు, పుల్కల్ మండలం

ఇబ్బంది పడుతున్నాం



పసల్వాది శివారులో ఉన్న అకోలా–నాందేడ్ జాతీయ రహదారి నుంచి సంగారెడ్డి శివారు వరకూ డివైడర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. డివైడర్ లేక ప్రతీనిత్యం మామిడిపల్లి చౌరస్తా నుంచి సంగారెడ్డికి రావాడానికి ఇబ్బంది పడుతున్నాం.

శ్రీకాంత్ రెడ్డి
వెండుకోల్, చౌటకూరు మండలం

తేనేటీగల దాడి ఐదుగురికి గాయాలు



గాయపడిన వారిని అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని జప్తినాచారం గ్రామ శివారులో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలపై కందిరీగలు దాడి చేశాయి. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం..గ్రామ శివారులో ఈజీఎస్ పథకంలో భూమి లెవలింగ్ పనులు చేస్తున్నక్రమంలో ఒక్కసారిగా కందిరీగలు దాడిచేశాయి. భయంతో కూలీలు పరుగులు తీశారు. మాడోజు తిరుపతి(48), గుర్రాల పద్మ(38), చిన్న బోయిన లింగయ్య(46), కుంచెం శ్రీకాంత్(20), మిట్టపల్లి కనుకయ్య(45)లపై దాడి చేయగా గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించే నిమిత్తం స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. 108 అంబులెన్స్‌లో సిబ్బంది మహేందర్, రమేశ్‌లు ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో తిరుపతి, పద్మలకు తీవ్ర గాయాలయ్యాయని వైద్యులు పేర్కొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ అంజనీకుమార్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, పోలీస్ అధికారులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. జిల్లాలోని పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టికల్ విధుల గురించి పోలీస్ అధికారులతో హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ..ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ మానిటర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. పెండింగ్ మర్డర్ కేసులు, గంజాయి కేసులను త్వరగా ఛేదించాలని, కేసుల్లో కన్విక్షన్ రేట్ పెంచాలన్నారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ అధికారులు, తదితర వర్టికల్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తరచూగా శిక్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, గజ్వేల్ ఏసీపీ రమేష్, సీఐలు భానుప్రకాష్, బిక్షపతి, రవికుమార్, జానకీరామ్‌రెడ్డి, కృష్ణ, కమలాకర్, మహిళ పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ధరణికుమార్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ పేరుతో సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: మీ దగ్గర చదువుకున్న స్టూడెంట్ అని ప్రస్తుతం ఆర్మీ జవాన్‌లో పని చేస్తున్నానంటూ మాటలు కలిపి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ కాల్‌కు స్పందించి సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ దగ్గర చదువుకున్న స్టూడెంట్ అని, ప్రస్తుతం ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు మాటలు కలిపాడు. తన దగ్గర తక్కువ ధరకు ఎలక్ట్రానిక్ వస్తువులు ఉన్నాయని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు రూ.45వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తను మోసపోయినట్టు గమనించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఫోన్‌లో ట్రాఫ్ లోన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగా ఫేక్ యాప్ డౌన్‌లోడ్ అయింది. ఆ యాప్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయడంతో బాధితుడి ఖాతా నుంచి రూ.37,804 డెబిట్ అయ్యాయి.

దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తన మిత్రుడుకి పంపాల్సిన డబ్బులు పొరపాటున మీ ఖాతాకు వచ్చాయని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలపడంతో బాధితుడి ఖాతా నుంచి రూ.30,001 డెబిట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగం ఉందని, తన బయోడేటా వివరాలు పంపించాలని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన వివరాలు పంపించాడు. అనంతరం రిజిస్ట్రేషన్ చార్జీల నిమిత్తం డబ్బులు పంపించాలని తెలపడంతో బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన ఖాతాకు ఆన్‌లైన్‌లో రూ.20,200 పంపించి మోసపోయాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్‌తో గుర్తింపు

బాధితుడికి అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ రవికుమార్, ఎస్‌ఐ భాస్కర్

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిద్దిపేట టూటౌన్ పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట నర్సాపూర్‌కు చెందిన సంపత్ నాలుగు రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో అతడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ యాప్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి అందులో ఉన్న సిమ్ కార్డును తీసివేసి తన సిమ్ కార్డును వేశాడు. సెల్‌ఫోన్ వినియోగిస్తున్న అతడి ఫోన్ నెంబర్, వివరాలు పోలీసులకు తెలియడంతో వెంటనే అతడిని గుర్తించి అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడిని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి సీఐ రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ..ఎవరైనా ఫోన్‌ను పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, ఇతర వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సీఐ వెంట ఎస్‌ఐ భాస్కర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో భార్య మృతి

- కడచూపునకు రాని భర్త
- శవంతో భర్త ఇంటి ముందు బంధువుల ఆందోళన

దుబ్బాకరూరల్: భర్త ఇంటి ముందు భార్య శవంతో బంధువులు ఆందోళన చేసిన సంఘటన మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దోర్నాల రాజయ్యకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రగుణతో 35సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో రాజయ్య మరో మహిళతో సహ జీవనం చేస్తున్నాడు. భర్తతో పాటుగా సహజీవనం చేస్తున్న రెండో మహిళతో గొడవలు జరగడంతో రగుణ తన పిల్లలతో కలిసి తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. ఇటీవల రగుణ అనారోగ్యానికి గురైంది. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం ఆమె మృతి చెందింది. మృతి చెందిన విషయాన్ని బంధువులు భర్త రాజయ్యకు తెలపడంతో పట్టించుకోలేదు. ఆగ్రహించిన బంధువులు రగుణ శవంతో భర్త ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం భర్త ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అత్తింటి వారు దాడి చేస్తారనే భయంతో భర్త రాజయ్య పోలీస్ స్టేషన్లో తలదాచుకున్నాడు. భార్య అంత్యక్రియలు నిర్వహించాలని గ్రామస్తులు, బంధువులు రాజయ్యకు నచ్చజెప్పినప్పటికీ వినలేదు. దీంతో అంత్యక్రియలు నిర్వహించకుండా శవాన్ని ఇంటి ముందు ఉంచారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

రామాయంపేట(మెదక్): నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లబాపూర్ గ్రామ శివారులో అర్ధరాత్రి అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న జేసీబీని అధికారులు సీజ్‌చేసి జరిమానా విధించారు. పోలీసులకు ఆదివారం రాత్రి అందిన సమాచారం మేరకు మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న ప్రాంతానికి వెళ్లగా అప్పటికే టిప్పర్లు వెళ్లిపోయాయి. అక్కడే ఉన్న ఒక జేసీబీని స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నార్సింగి ఎస్‌ఐ నర్సింలు పట్టుబడ్డ జేసీబీని చేగుంట తహసీల్దార్‌కు అప్పగించారు. అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న జేసీబీ నిర్వాహకుడికి జరిమానా విధించామని తహసీల్దార్ ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



బేగరి యోహాన్ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపూర్ గ్రామానికి చెందిన బేగరి యోహాన్(40) విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ట్రాన్స్ ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడం లేదని బేగరి యోహాన్‌ను తీసుకెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని తలచి లైన్ మెన్‌కు ఫోన్ చేసి లైన్ క్లియరెన్స్ తీసుకొని స్తంభం ఎక్కాడు. అంతలోనే గాలి దుమారం రావడంతో సదాశివపేటకు సంబంధించిన 24గంటల లైన్ వైరుకు, వెంకటాపూర్ లైన్ వైరు తాకడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ ఘటనలో యోహాన్ విద్యుదాఘాతానికి గురై రెండు కాళ్లు, చీలమండల వరకూ కాలిపోయాయి. స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. తలకు, ముఖానికి గాయాలు కావడంతో వెంటనే ఆటోలో సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

నిలబడిన వ్యక్తిని ఢీకొట్టి..



మల్లయ్య (ఫైల్)

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రక్కన నిలుచొని మాట్లాడుతున్న వ్యక్తిని బైక్ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన సంఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగింది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..అదే గ్రామానికి చెందిన మిద్దె అస్క మల్లయ్య(50) చిన్నకోడూరు మండలంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన స్వగ్రామం అప్పనపల్లికి వచ్చి తిరిగి బైక్‌పై సిద్దిపేటకు వెళ్లుతున్నాడు. గ్రామ శివారులో ఉన్న చిలుకోటి మల్లారెడ్డి కోళ్ల ఫాం వద్ద పరిచయస్తుడైన చిర్ర సోహన్‌లాల్ కనిపిస్తే రోడ్డు ప్రక్కన బైక్ నిలుపుకుని మాట్లాడుతున్నాడు. సిద్దిపేట నుంచి దుబ్బాక వైపు బైక్‌పై భార్యతో కలిసి వెళ్లుతున్న బరిగెల రాజ్‌కుమార్ అతివేగంగా వచ్చి మల్లయ్యను ఢీకొట్టండంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని అన్న రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


భూ వివాదం.. ఇరు వర్గాల ఘర్షణ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

శివ్వంపేట(నర్సాపూర్): భూ వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండల పరిధి కొత్తపేటలో సోమవారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన సార శేఖర్‌గౌడ్, సార శివరామగౌడ్‌ల మధ్య గతకొంత కాలంగా భూ వివాదం కొనసాగుతుంది. సోమవారం శేఖర్‌గౌడ్ కుటుంబ సభ్యులు వారి పొలంలో వరికోత పనులు చేస్తుండగా అట్టి భూమిలో శివరామగౌడ్‌కు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని అడ్డుకోవడానికి వెళ్లాడు. దీంతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఒకరినొకరు దాడులు చేసుకుంటున్నారనే విషయం తెలుసుకున్న శివ్వంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. తమ పొలంలో వరికోత పనులు చేస్తుండగా శివరామగౌడ్ వర్గీయులు వచ్చి కారంపొడి చల్లి కత్తులతో తమపై దాడి చేశారని శేఖర్‌గౌడ్ ఫిర్యాదు చేశాడు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ తన వద్ద ఉందని తన భూమిలో శేఖర్‌గౌడ్ మనుషులు వరికోత పనులు చేస్తున్నారని శివరామగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంతరావ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



బొగ్గుల రాములు మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కుకునూరుపల్లిలోని మంగోల్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లికి చెందిన బొగ్గుల రాములు(46) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై కుకునూరుపల్లి నుంచి మంగోల్ గ్రామానికి వెలుతున్నాడు. హైద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్త స్రావమైంది. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేశారు. విషయం తెలుసుకున్న వార్డు సభ్యులు కొంతం రాజు ఆటోలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. పరీక్షించిన వైద్యుడు బల్‌బీర్‌సింగ్ రాములు పరిస్థితి విషమంగా ఉందంటూ గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికే రాములు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. లారీ డ్రైవర్ కల్లెపు నరేందర్‌పై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పుష్పరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సకాలంలో అంబులెన్స్ వచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవి

రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలై 30 నిమిషాలు దాటిన కూడా 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకోలేదని స్థానికులు వాపోయారు. అంబులెన్స్ రాకపోవడంతో బాధితుడిని ఆటోలో ఆస్పత్రికి తరలించామన్నారు.

గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని...



వైద్యులతో మాట్లాడుతున్న బాధితుడు

టేక్మాల్(మెదక్): శేరిపల్లి గొర్రెల కాపరి పైతర దుర్గయ్య సోమవారం పశువైద్యశాల ఎదుట మృతి చెందిన గొర్రెలతో నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి..ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నానని గత ఇరవై రోజులుగా 15గొర్రెలు మృత్యువాత పడ్డాయని వాపోయాడు. మరో 3 గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఆస్పత్రికి తీసుకొస్తే వైద్యులు వచ్చేలోపే అవి చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. జీవాలు చనిపోతున్నాయని తమ దృష్టికి తీసుకురాలేదని, ఫోన్ చేసి జీవాలకు రోగాలు వచ్చినట్లు తెలపగా ఆస్పత్రికి తీసుకురమ్మన్నానని, మేము వచ్చేలోపే గొర్రెలు చనిపోయినట్లు వైద్యాధికారి రమేశ్ తెలిపారు. కలుషిత నీటిని తాగడంవల్లే గొర్రెలు మృత్యువాత పడుతున్నట్లు ఆయన తెలిపారు. బాధి తునికి న్యాయం జరిగేలా చూస్తామని వైద్యాధికారి రమేశ్, తహసీల్దార్ హర్దిప్ సింగ్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నర్సాపూర్: జాతీయ రహదారి పక్కన కోతులకు ఆహారం వేయొద్దన్న పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తున్న వ్యక్తులపై అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దిరాంసింగ్ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సాపూర్ అటవీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ మెదక్ జాతీయ రహదారిపై పెట్రోలింగ్ చేస్తూ రోడ్డు పక్కన కోతులకు ఆహారం వేసే వారికి జరిమానా విధిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా సోమవారం తాము పెట్రోలింగ్ చేపడుతుండగా పలువురు వ్యక్తులు రోడ్డు పక్కన కోతులకు ఆహారం వేస్తుండగా వారిని పట్టుకున్నామన్నారు. నిబంధనలు ఉల్లంగించిన ముగ్గురు వ్యక్తులకు రూ. 3,200లు జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట అటవీ సిబ్బంది ఎండీ గౌస్, రవికుమార్ తదితరులు ఉన్నారు.